క్లుప్తంగా

అమ్మవారిని దర్శించుకున్న డాక్టర్ దంపతులు



బలభద్రపురంలో అమ్మవారిని దర్శించుకుంటున్న సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు

బిక్కవోలు: బలభద్రపురం గ్రామంలో ఉన్న తూర్పు తిరుమలగా పేరుగాంచిన శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి ఆలయం ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన ద్వాదశ జ్యోతిర్లింగ సహిత అష్టాదశ శక్తి పీఠాల అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గం కన్వీనర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు మంగళవారం దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరునికి అభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

బిక్కవోలు: కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నసమారాధన చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయం ఈవో రామలింగ భాస్కర్, సిబ్బంది నామాల ప్రసాద్, సత్తి బాబు ,కోళ్ళ వీరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు అభివృద్ధి పనులు



మర్రిపూడిలో కేబీకే సంస్థ అభివృద్ధి చేసిన రోడ్డు

రంగంపేట: మర్రిపూడి గ్రామంలో కాపుల రామాలయం వద్ద నుంచి గ్రామ శివారు చర్చి వరకు గల ఆర్ అండ్ బీ రోడ్డు గుంతలమయంగా ఉంది. ఈ రోడ్డుపై రాకపోకలకు గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో చిన బ్రహ్మదేవంకు చెందిన కేబీకే సంస్థ యాజన్యం నల్ల మెటల్‌తో రోడ్డును అభివృద్ధి చేశారు. తమ సమస్య పరిష్కారం అవడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అగ్నిప్రమాద బాధితులకు నాయకుల పరామర్శ

కోరుకొండ: దోసకాయలపల్లిలో ఈనెల 11వ తేదీన జరిగిన అగ్ని ప్రమాదంలో 40 మేకల మృతి చెందిన వాటి యజమాని జిత్తుక సుబ్రహ్మణ్యంను మంగళవారం బిజేపీ నాయకులు పరామర్శించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, రాష్ట్రనాయకులు ఏపీఆర్‌చౌదరి బాధితులను ఓదార్చారు. ప్రమాదానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగిందని, సుమారు రూ.7 లక్షల నష్టం వాటిల్లిందని అంచనా వేశారు. ప్రమాదం జరిగిన సంఘటన స్థలానికి కోరుకొండ తహసీల్దార్ సుస్వాగతం రాకపోవడాన్ని తప్పుపట్టారు. కార్యక్రమంలో వీఆర్వో ప్రసాద్‌చౌదరి, శ్రీనివాస్, నాయకులు ఉన్నారు.

షెడ్యూల్ ప్రకారం తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించండి

కంబాలచెరువు: అకాడమిక్ క్యాలెండర్ ప్రకారం నిర్దేశించిన తేదీల్లో తల్లిదండ్రుల సమావేశాలు విధిగా నిర్వహించాలని అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్‌కుమార్ ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. స్థానిక మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం తల్లిదండ్రుల సమావేశంలో డీఐ పాల్గొన్నారు. పాఠశాలలకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సౌకర్యాలు, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం, విద్యార్థుల హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు, మూల్యాంకన పుస్తకాలు తదితర అంశాలపై చర్చ నిర్వహించారు. ఎస్ఎంసీ చైర్మన్ నయీముద్దీన్ మాట్లాడుతూ ఉర్దూ పండిట్‌లను నియమించాలని, పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్ గ్రేడ్ చేయాలన్నారు.

బాణసంచా తయారీ, విక్రయాలకు అనుమతులు తప్పనిసరి

పెదపూడి: దీపావళికి సంబంధించి బాణసంచా విక్రయాలు, తయారీకి సంబంధించి నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని పెదపూడి ఎస్సై ఎస్.తులసీరామ్ అన్నారు. ఆయన మంగళవారం పెదపూడిలో మాట్లాడుతూ బాణచా ఎక్కడైన నిల్వ ఉంచినా, రవాణా చేసినా ఆ సమాచారం తమకు తెలియజేయాలన్నారు. ఆ బాణసంచా ప్రమాదవశాత్తు ప్రమాదం సంభవిస్తే నిల్వ ఉంచిన వారు, రవాణా చేసిన వారితోపాటు పక్కన ఉన్న వారికి ప్రమాదం ఏర్పడుతుందన్నారు. దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

చంద్రబాబు పాలనకు చరమగీతం

- వైఎస్సార్ సీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి
- నకిలీ మద్యం తయారీ, విక్రయాలపై ప్రజల యుద్ధం
- మద్దతుగా వైఎస్సార్ సీపీ
- కోరుకొండ ఎక్సైజ్ కార్యాలయం వద్ద ధర్నా



కాపవరంలో ఎక్సైజ్ కార్యాలయానికి ర్యాలీగా వెళుతున్న ఆందోళనకారులు



ధర్నా శిబిరం వద్ద ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం అందజేస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి తదితరులు



కాపవరంలో ఎక్సైజ్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న పార్టీ నాయకులు తదితరులు

కోరుకొండ: విద్య, వైద్యం సదుపాయాన్ని కల్పించకుండా కల్తీ మద్యాన్నిస్తానంటున్న నారా చంద్రబాబు పాలనకు చరమగీతం పాడాలని వైఎస్సార్ సీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి పిలుపునిచ్చారు. మంగళవారం కాపవరంలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయం వద్ద పార్టీ సీనియర్ నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మి ఆధ్వర్యంలో మహిళలు ధర్నా నిర్వహించారు. ఆందోళనకారులు కాపవరం శివారు నుంచి ఎక్సైజ్ కార్యాలయం వరకూ ప్రదర్శనగా వెళ్లిన పెద్దఎత్తున నినాదాలు చేశారు. నకిలీ మద్యం సీసాలను ప్రదర్శిస్తూ ఈ ర్యాలీ సాగింది. ఈ ర్యాలీ ఎక్సైజ్ కార్యాలయానికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో ధర్నాను అడ్డుకుంటే మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీంతో పోలీసులు ఎక్సైజ్ సీఐ శ్రీనివాసబాలాజీని తీసుకొచ్చారు. ఈ మేరకు జక్కంపూడి విజయలక్ష్మి ఆధ్వర్యంలో సీఐ శ్రీనివాస బాలాజీ వినతి పత్రం అందజేశారు. నకిలీ మద్యం కుంభకోణంపై సీబీఐతో విచారణ జరిపించాలని, నకిలీ మద్యం కుటీర పరిశ్రమలు, బెల్టుషాపులను అరికట్టాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న నకిలీ మద్యం వ్యాపారాలతో ప్రజల ప్రాణాలను హరిస్తుందన్నారు. రాజానగరం నియోజకవర్గంలోని కోరుకొండ, రాజానగరం, సీతానగరం, గోకవరం మండలాల్లో నకిలీ మద్యం షాపులపై తనిఖీ నిర్వహించాలన్నారు. నకిలీ మద్యం, బెల్టుషాపుల ద్వారా జరుగుతున్న నకిలీ మద్యం అమ్మకాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు నక్కా రాంబాబు, దూలంపెద్ద, తాడి హరిశ్చంద్రప్రసాద్ రెడ్డి గుమ్ములూరు, మునగాల తదితర గ్రామాల్లో జరుగుతున్న సారా, మద్యం అమ్మకాలను ఎందుకు అడ్డుకోవడంలేదని ప్రశ్నించారు. అలాగే నిబంధనలను అతిక్రమించి నిర్వహిస్తున్న దుకాణాల అనుమతులను రద్దు చేయాలన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న అక్రమవ్యాపారాల వివరాలిచ్చి, తక్షణమే అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసబాలాజీ మాట్లాడుతూ వినతిపత్రంలోని డిమాండ్లను ఉన్నతాధికారులకు అందజేస్తున్నారు. ఈ సందర్భంగా జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రజలకు ఉచితంగా విద్య, వైద్యాన్ని అందించే లక్ష్యంతో 17 మెడికల్ కాలేజీలు, హాస్పిటల్స్ తీసుకొచ్చి, వాటిలో 7 పూర్తి చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ఐదు వేల కోట్ల రూపాయల నిధులతో పూర్తి చేయాల్సిన కూటమి ప్రభుత్వం పీపీపీ విధానంతో బడా కోటీశ్వరులకు దారాదత్తం చేసేలా కుట్ర చేస్తుందని విమర్శించారు. పేదవర్గాలకు చెందిన పిల్లలు డాక్టర్లు కావడాన్ని సహించలేని చంద్రబాబు కుయుక్తులు చేస్తున్నాడన్నారు. ఆర్‌బీకే, గ్రామ సచివాలయాలను పోలీసుస్టేషన్లు చేస్తూ ప్రభుత్వ కార్యాలయాలను సొంతానికి వినియోగించుకుంటున్నారని దుయ్యబట్టారు. సారాను యథేచ్ఛగా నిర్వహించడంలో చంద్రబాబుది అందెవేసిన చేయన్నారు. తన మామా, దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని హస్తగతంచేసుకున్న చంద్రబాబు చీప్ లిక్కరును తీసికొచ్చి, ప్రజల ప్రాణాలను హరిస్తుందన్నారు. ప్రజలను కాపాడాల్సిన ప్రభుత్వమే వారి ప్రాణాను తీస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మహిళావిభాగం నియోజకవర్గం కన్వీనర్ చీర్ల ఉమాదేవి, జిల్లా జాయింట్ సెక్రటరీ కె.రాజారమాదేవి, కోరుకొండ మండల కన్వీనర్ అడపా కనకరాజు, కోరుకొండ జెడ్పీటీసీ క్రరి నాగేశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకుడు నక్కా రాంబాబు, సీతానగరం ఎంపీపీ గుర్రాల జోత్స్న, వైస్ ఎంపీపీ(2) సత్యం మధనబాబు, వలంటీర్ల విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పెదపాటి డాక్టర్‌బాబు, ఎస్సీసెల్ అధ్యక్షుడు అంబటి రాజు, రాజానగరం జెడ్పీటీసీ వాశంసెట్టి పెద్దవెంకన్న, కన్వీనర్ దూలం పెద్ద, కో-కన్వీనర్ గండి నానిబాబు, మాజీ కన్వీనర్ మందారపు వీర్రాజు, పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి తాడి హరిశ్చంద్రప్రసాద్‌రెడ్డి, జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు కొండపల్లి దుర్గారావు, పార్టీ నాయకులు కంటే వినయ్‌తేజ, బొరుసు బద్రి, నేతుల చిన్ని, గొల్లపల్లి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కోటి సంతకాలపై సన్నాహక సమావేశం



బాణసంచా ప్రమాద మృతులకు సంతాపం తెలుపుతున్న డాక్టర్ సూర్యనారాయణరెడ్డి నాయకులు



కోటి సంతకాల సేకరణ సన్నాహక సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు

అనపర్తి: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ కోఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అధ్యక్షతన కోటి సంతకాల సేకరణ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ పేదలకే కాకుండా రాష్ట్రంలోని ప్రజలందరికీ నాణ్యమైన ఉచిత వైద్యవిద్యను అందించాలని మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ఏర్పాటుకు కృషి చేశారని, కాని కూటమి ప్రభుత్వం మాత్రం ప్రజల ఆస్తులను ప్రైవేటు పరం చేసి వేల కోట్ల రూపాయలను దోచుకునే యత్నం చేస్తోందని విమర్శించారు. ఈ నేపథ్యంలో పార్టీ అధినేత వైఎస్ జగన్ పిలుపు మేరకు నియోజకవర్గంలో కోటి సంతకాల ఉద్యమాన్ని ఉప్పెనలా చేపట్టి మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఆలోచనను వ్యతిరేకిస్తున్న ప్రజల ఆకాంక్షను పాలకులకు తెలిసేలా చేయవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సూచించారు. కోటి సంతకాల కార్యక్రమాన్ని ఒక పవిత్ర యజ్ఞంలా భావించి చిత్తశుద్ధితో ప్రతి ఒక్కరూ భాగస్వాములై ముందుకు తీసుకువెళ్లాలని ఆయన కోరారు. అనంతరం మండపేట నియోజకవర్గంలోని రాయవరంలో ఈ నెల 9వ తేదీన జరిగిన ఘోర అగ్ని ప్రమాదంలో అమరులైన వారికి సభలోని వారంతా రెండు నిముషాల పాటు మౌనం పాటించి సంతాపం తెలిపారు. అనంతరం వారి కుటుంబాలకు సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో నాలుగు మండలాలకు చెందిన పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

సీతానగరం: మండలంలోని నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ టెస్టుకు సిద్ధమవుతున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉచితంగా స్టడీ మెటీరియల్ మంగళవారం అందజేశారు. ఏపీయూటీఎఫ్, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రస్తుత జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, కృష్ణ, గుంటూరు జిల్లాల మాజీ శాసన మండలి సభ్యులు కేఎస్ లక్ష్మణరావు రూపొందించిన స్టడీ మెటీరియల్ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. అందులో భాగంగా మండలంలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందించారు. రఘుదేవపురం పీఎమ్‌శ్రీ జిల్లా పరిషత్ హైస్కూల్లో జరిగిన మెటీరియల్ పుస్తకావిష్కరణ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎం.శ్యామలాదేవి, మండల యూటీఎఫ్ అధ్యక్షుడు ఎస్.రాజు, ప్రధాన కార్యదర్శి ఆర్.పాపారావు పుస్తకావిష్కరణ చేసి విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.ఆంజనేయుడు, ఇస్సా ఖాన్, జి.శేఖర్, బి.కామరాజు, కె.గంగాధర్, పి.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

దీపాలతో జ్ఞానజ్యోతి వెలుగులు పంచండి



త్రైత సిద్ధాంత భగవద్గీతతో ప్రచారం చేస్తున్న ప్రబోధ సేవా సమితి సభ్యులు

రాజానగరం: దీపావళి జ్ఞాన జ్యోతి వెలుగులు ప్రతి ఇంటా వెలగాలని రాజమహేంద్రవరానికి చెందిన త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు అన్నారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీతతో పాటు అనుబంధ గ్రంథాలపై మండలంలోని రాజానగరంలో మంగళవారం ప్రచారం నిర్వహించారు. దీపావళి రోజు ప్రతి ఇంటా వెలుగులు పంచే దీపాలను వెలిగించి యజ్ఞంలో భాగస్వాములు కావాలన్నారు. ఈ ప్రచారంలో సేవా సమితి సభ్యులు శేఖర్‌బాబు, మూర్తి, లక్ష్మీనారాయణ, జయరామ్, విజయ, సూర్యకుమారి, లోహిత, రాణి,సంధ్యారాణి, సన్నిధి, సాత్విక్‌లు పాల్గొన్నారు.

డాక్టర్ కొల్లూరికి అభినందనలు



డాక్టర్ కొల్లూరిని సన్మానిస్తున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజానగరం: ఏ వృత్తిలోని వారికైనా లభించే పురస్కారాలు వారిలో అంకితభావాన్ని మరింతగా పెంపొందించేందుకు తోడ్పడుతాతాయని వైఎస్సార్ సీపీ రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గ కోఆర్డినేటర్, ప్రముఖ వైద్యులు డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. ఏషియా పీసీఆర్ 2025 అంతర్జాతీయ సదస్సులో ఫెలోషిప్‌ని అందుకున్న డాక్టర్ కొల్లూరి లక్ష్మణ్‌ని దివాన్‌చెరువులోని విజయభారతి చెస్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో మంగళవారం నిర్వహించిన అభినందన సభలో డాక్టర్ గూడూరితోపాటు పలువురు సహ వైద్యులు, మిత్రులు ఘనంగా సన్మానించారు. కార్డియాలజీ విభాగంలో ఆయన అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా అంతర్జాతీయ సదస్సు ఫెలోషిప్‌తో గుర్తించిందన్నారు. ఇప్పటికే ఆయన రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక పురస్కారాలు అందుకున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీఈఓ గూడూరి రాధిక, డాక్టర్ సోమనాథ్, వైద్యులు డాక్టర్ వంశీకృష్ణంరాజు, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ అన్వేష్ క్యానామ్, డాక్టర్ హితేష్ చరన్, డాక్టర్ సాహితీ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల ధర్నా

సీటీఆర్ఐ: దేశ వ్యాప్తంగా ప్రైవేటు బ్యాంకు ఉద్యోగుల సమస్యలకు మద్దతుగా మంగళవారం కరూర్ వైశ్య బ్యాంకు వద్ద జిల్లా బ్యాంకు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. బ్యాంకు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని జిల్లా బీఈసీసీ కార్యదర్శి లక్ష్మీపతిరావు అన్నారు.

కార్మికులపై కూటమి కక్ష

- పని గంటలు పెంచుతూ నిర్ణయం
- బిల్లును ఆమోదించిన కూటమి పార్టీలు
- మండిపడుతున్న శ్రామికులు



భవన నిర్మాణ పనిలో నిమగ్నమైన కార్మికులు

పెదపూడి: కార్మికవర్గం అంతర్జాతీయంగా పోరాడి సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని మార్చి అదనంగా మరో రెండు గంటల పాటు పని చేసేలా అసెంబ్లీలో బిల్లు పాస్ చేసిన కూటమి ప్రభుత్వంపై కార్మికులు మండిపడుతున్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వకపోగా అదనంగా రెండు గంటల పాటు పని చేయించుకోవడం అంటే తమ శ్రమను దోచుకోవడమేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్‌లోని అంశాలను రాష్ట్రంలో తెలుగుదేశం , జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అమలు చేయడాన్ని ఖండిస్తున్నారు. ఏపీ అసెంబ్లీలో ఎన్డీఏ పార్టీలు అన్నీ కలిసి ఫ్యాక్టరీలు, షాపులు, సంస్థల్లో పనిచేసే కార్మికుల పని గంటల పెంపును ఆమోదించడం దారుణమని వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నేటి వరకు కనీస వేతనాలు పెంచని ప్రభుత్వం, పని గంటలు పెంచడంతో భగ్గుమంటున్నారు. కార్మిక వర్గంపై కనీస చిత్తశుద్ధి ఉంటే బిల్లును ఉపసంహరించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఓటీకి టాటా

పరిశ్రమలు, దుకాణాల్లో ఇప్పటి వరకూ 8 గంటల పని విధానం అమల్లో ఉంది. కార్మికులు అదనంగా ఒకటి, రెండు గంటలు పని చేస్తే వారికి ఓటీ ఇచ్చేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి ఉండదు. ఎందుకుంటే కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టం వలన కార్మికులు ప్రతి రోజూ అదనంగా మరో రెండు గంటలు పనిచేయాల్సి వస్తోంది. దీని వలన వ్యాపారవేత్తలకు లాభం ఉంటుంది. కానీ కార్మికులకు అదనంగా ఒక్క రూపాయి కూడా రాదు.


మహిళలకు రక్షణ కరవు

మహిళలు అదనంగా మరో రెండు గంటలు పని చేయడం వలన రాత్రి సమయాల్లో ఇంటికి చేరాల్సి వస్తోంది. దీని వలన వారికి రవాణాకు సమస్యలు ఏర్పడతాయి. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో మహిళలకు రక్షణ కరువైంది. ఇక రాత్రి సమయాల్లో వారు ప్రయాణం చేయడం పూర్తిగా రక్షణ లేని పరిస్థితి కలుగుతుంది.

నియోజకవర్గంలో..

అనపర్తి నియోజకవర్గంలో అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాలు ఉన్నాయి. ఈ మండలాల్లో కార్మికులు వివిధ షాపులు, కంపెనీలు, ఫ్యాక్టరీలు, ఆసుపత్రులు, సూపర్‌బజార్లు, బట్టల షాపులు, నగల దుకాణాల్లో పనిచేస్తున్నారు. నియోజకవర్గంలో అన్ని షాపుల్లో సుమారు 20 వేల మందికి పైగా పని చేస్తున్నారని ఒక అంచనా. ఇప్పటి వరకూ వీటిలో మూడు షిఫ్టులుగా పని చేసేవారు. ఇక నుంచి అవి రెండు షిఫ్టులకే పరిమితమవుతాయి. అనపర్తి, జి.మామిడాడ, బిక్కవోలు, రంగంపేటలో పలుచోట్ల షాపులు, హాస్పిటళ్లు అధికంగా ఉన్నాయి. వీటిలో పని చేసే వారందరూ ఇప్పుడు రోజుకు పది గంటల చొప్పున పని చేయాల్సి ఉంటుంది.

పని భారం తగ్గించాలి



ప్రస్తుతం కార్మికులకు ఎనిమిది గంటల పని చేయడమే భారంగా మారింది. దీనిని పది గంటలకు పెంచడంతో ఆరోగ్య సమస్యలు పెరిగే అవకాశం ఉంది. అంతే కాకుండా పారిశ్రామిక అవసరాల కోసం 12 గంటల పాటు చేయించుకో వచ్చనే అనే వెసలుబాటును బిల్లులో పెట్టి దాన్ని కూడా ఆమోదించారు.

– వేగు రాంబాబు,
జనరల్ సెక్రటరీ భక్తాంజనేయ భవన నిర్మాణ కార్మిక సంఘం, ఏపీత్రయం

శ్రమ దోపిడీ



ప్రస్తుతం అన్ని చోట్లా యాంత్రీకరణ పెరగడంతో కార్మికులు పని చేయాల్సిన వేగం కూడా ఎక్కువైంది. దీంతో శ్రమ దోపిడీకి గురవుతారు. ఈ తరుణంలో ఉన్న పని గంటలు తగ్గించాల్సింది పోయి, అదనంగా పెంచడం దారుణం. దీని వలన కార్మికులపై ప్రతికూల ప్రభావం పడుతుంది. 8 గంటల పని విధానాన్నే కొనసాగించాలి.

– సొంబత్తుల చంటి,
వైఎస్సార్ సీపీ అనపర్తి నియోజకవర్గం ఎస్సీసెల్ కన్వీనర్

సమాచారం హక్కు చట్టంపై అవగాహన



ఎస్సై రవిచంద్రకుమార్‌కు వినతిప్రతం అందిస్తున్న కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ జిల్లా ప్రతినిధులు

బిక్కవోలు: గ్రామంలోని సమాచారం హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ జిల్లా ప్రతినిదులు బొడబళ్ళ శ్రీనివాస్, వి.శ్రీనివాస్, డి.అనిల్ కుమార్ మాట్లాడుతూ సమాచారం హక్కు చట్టం అమలులోకి వచ్చిన 20 సంవత్సరాలు పూర్తిందన్నారు. దేశ వ్యాప్తంగా సుమారు 5వేల మందిపైగా ఉన్న చట్టాల్లో సమాచార హక్కు చట్టం ఎంతో గొప్పదన్నారు. ఈ చట్టం వల్ల కోట్ల రూపాయాలు కుంభకోణాలు వెలుగు చూశాయన్నారు. ప్రతి ఒక్కరూ ఈ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. అనంతరం మండలంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయంలో సమాచారం హక్కు చట్టం బోర్డు ఏర్పాటు చేయాలని వినతి ప్రతాలు అందించారు.

‘నన్నయ’లో నేటి నుంచి ఫుడ్ ఫెస్టివల్



ఫుడ్ ఫెస్టివల్ బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ తదితరులు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రాంగణంలో డిపార్టుమెంట్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో బుధ, గురువారాలలో జరిగే మెగా ఫుడ్ ఫెస్టివల్‌ను విజయవంతం చేయాలని వీసీ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ తెలిపారు. ఫుడ్ ఫెస్టివల్ బ్యానర్‌ని మంగళవారం ఆవిష్కరించి, అకాడమిక్ ఈవెంట్స్‌ని లాంఛనంగా ప్రారంభించారు. ప్రపంచ ఆహార దినోత్సవాన్ని పురస్కరించుకుని, గోదావరి రుచులను, అభిరుచులను తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఆహార పదార్థాల తయారీలో ఔత్సాహికులు ఈ కార్యక్రమంలో పాల్గొని, తమ ప్రతిభను చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ భాగస్వామ్య సర్టిఫికెట్స్ అందజేస్తారన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి. విజయనిర్మల, హెచ్ఓడీ ఆచార్య డి. కల్యాణి, అధ్యాపకులు ఎంఎం కృష్ణవేణి, కె. సింధుజ, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం బాటిళ్ల స్వాధీనం



మద్యం బాటిళ్లతో నిందితుడిని అరెస్టు చేసిన ఎక్సైజ్ సిబ్బంది

రంగంపేట: అక్రమంగా విక్రయిస్తున్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆమె మాట్లాడుతూ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని అనపర్తి గ్రామంలో నిర్వహించిన దాడుల్లో బెల్టు షాపుల్లో అక్రమంగా విక్రయిస్తున్న 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కర్రి సత్తిరెడ్డి అనే వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఆమె తెలిపారు.

రైతులకు యూరియా సరఫరా చేయాలి

రంగంపేట: రైతులు యూరియా కోసం పడరాని పాట్లు పడుతున్నారని వ్యవసాయ అధికారులు తక్షణమే సరఫరా చేయాలని వైఎస్సార్ సీపీ నాయకుడు, అనపర్తి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మాచిన గోవిందరాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో రైతులకు యూరియా ఎంతో అవసరమన్నారు. రైతులకు అవసరమైనప్పుడు యూరియా అందించలేక పోవడం దారుణమన్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న యూరియా రైతుల డిమాండ్‌కు సరిపోవడం లేదు. మండలంలో ఈ ఏడాది మొక్కజొన్న, మినుము, వరి సాగు చేపట్టారు. అయితే యూరియా డిమాండ్ ఉన్నా ఈ పంటల్లో ప్రభుత్వం అరకొరగా సరఫరా చేస్తుండడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. యూరియా కోసం రైతు సేవా కేంద్రాల వద్దకు తిరిగినా ప్రయోజనం ఉండడంలేదు. ప్రైవేటు ఎరువుల దుకాణాల వద్ద యూరియా ఉన్నా బ్లాక్ చేస్తున్నారని, రూ.272 లకు ఇవ్వాల్సి యూరియా బస్తా అధిక రేట్లకు అమ్ముతున్నారన్నారు. వ్యవసాయ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని గోవిందరాజు ఆరోపించారు. ప్రైవేటు ఫెర్టిలైజర్స్ దుకాణాల యజమానులతో వ్యవసాయ అధికారులు కుమ్మక్కు అవుతున్నారని ఆయన విమర్శించారు. ఈ విషయం పై అధికారులు తక్షణమే స్పందించి రైతులకు యూరియా కొరత లేకుండా చర్యలు చేపట్టాలన్నారు.

జీఎస్టీపై అవగాహన

సీతానగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు ఆధ్వర్యంలో మంగళవారం జీఎస్టీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాల నుంచి అధ్యాపకులు, విద్యార్థులు ర్యాలీ చేస్తూ దత్తత గ్రామమైన నాగరత్నం కాలనీ ప్రజలకు జీఎస్టీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ హరే రామకృష్ణ, ఎస్ఎస్ఎస్ పీవో డాక్టర్ ఎమ్ సుధామయి, అధ్యాపకులు మదీనా, సుబ్బారావు, నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.